క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి ప్రజ్ఞా వికాసాన్ని ఈ నెల 15న నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు హర్ష పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నగరాధ్యక్ష, కార్యదర్శి నరేంద్ర, అనిల్, నేతలు సిసింద్రీ, ప్రశాంత్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడటం తగదు

నెల్లూరు(బారకాసు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై అనుచితంగా మాట్లాడితే ఊరుకునేదిలేదని పార్టీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం మాట్లాడారు. 13 ఏళ్లుగా నెల్లూరు రూరల్ రాజకీయాల్లో తాను క్రియాశీలకంగా వ్యవహరించానని చెప్పారు.

మోసగాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): స్థలం తనదంటూ విక్రయానికి పెట్టి అడ్వాన్స్ కింద నగదును తీసుకొని మోసగించిన వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. విజయవాడకు చెందిన రమేష్ ఓ ప్రైవేట్ సంస్థ.. దాని అనుబంధ సంస్థకు న్యాయసలహాదారుడిగా పనిచేస్తున్నారు. కంపెనీకి స్థలాలను కొనుగోలు చేస్తుంటారు. స్థలాల కోసం ఇద్దరు మధ్యవర్తుల ద్వారా సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ నగర్‌లో నివాసం ఉంటున్న చినవెంగళ్‌రెడ్డిని సంస్థ ప్రతినిధులు గతేడాది సెప్టెంబర్‌లో కలిశారు. తనది సొంతిల్లని.. దుత్తలూరు మండలం జంగాలపల్లిలో 80 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేసి స్వాధీన అగ్రిమెంట్ చేసుకున్నానని ఆయన తెలిపారు. సదరు పొలాన్ని కంపెనీ కొనుగోలు చేస్తే విక్రయదారులతో రిజిస్టర్ చేయిస్తానని వారిని వెంగళ్‌రెడ్డి నమ్మించారు. దీంతో కంపెనీ రూ.20 లక్షలను చినవెంగళ్‌రెడ్డికి బదిలీ చేసింది. నిర్ణీత గడువులోపు పొలాన్ని రిజిస్టర్ చేయించకపోవడంతో కంపెనీ ప్రతినిధులు నిలదీశారు. సమాధానాన్ని దాటేయడంతో జంగాలపల్లిలో విచారణ చేపట్టారు. అతని స్వాధీనంలో ఏ స్థలమూ లేదని.. అతను చూపించిన స్థలం మరొకరిదని తేలింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): బాలిక అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌జీనగర్‌లో నివాసం ఉంటున్న నాగమణి తన కుమార్తెతో కలిసి సమీపంలోని ఇళ్లలో పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. గత నెల 27న పనులకు తల్లీకుమార్తె వెళ్లారు. కొద్దిసేపటి అనంతరం బాలిక తాను ఇంటికెళ్తున్నానని, తెలిసిన వారి పెళ్లికెళ్లొస్తానని చెప్పి బయల్దేరారు. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

బురిడీ కొట్టించి నగదు స్వాహా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అమ్మఒడి పథకంలో నగదు అందని వారికి రూ.14 వేల చొప్పున జమ చేస్తామంటూ ఓ ఆగంతకుడు నలుగురు నుంచి రూ.54 వేలను స్వాహా చేసిన ఘటన వెంకటేశ్వరపురంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల సమాచారం మేరకు.. 54వ డివిజన్ ఇస్లాంపేటలో వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్న మల్లికకు ఓ నంబర్ నుంచి కాల్ వచ్చింది. తాము అమరావతిలోని సచివాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని.. మీ పరిధిలోని 50 కుటుంబాలకు చెందిన వారితో మాట్లాడాలని.. వారిని కాన్ఫరెన్స్‌లో పెట్టాలని సూచించారు. దీంతో వారిని కాన్ఫరెన్స్‌లో పెట్టారు. ఈ క్రమంలో అమ్మఒడి నగదు పడని నలుగురి ఫోన్ నంబర్లను సదరు వ్యక్తి సేకరించారు. ఫోన్ కట్ చేసిన అనంతరం రెండు నంబర్ల ద్వారా వారికి ఫోన్ చేసి.. మరో గంటలో అమ్మఒడి ద్వారా రూ.14 వేలు ఖాతాలో జమవుతాయంటూ వారి నుంచి ఏటీఎం, బ్యాంక్ ఖాతా నంబర్లను సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తి నుంచి వచ్చిన లింకులను క్లిక్ చేసిన అనంతరం హబీబున్నీసా అకౌంట్ నుంచి రూ.17,400, మోసిన్ ఖాతా నుంచి రూ.20 వేలు, వహీదా నుంచి రూ.3,300, ఫరీదా నుంచి రూ.14 వేలను స్వాహా చేశారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంట్లోనూ చదివించాలి

కోవూరు : పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద కూడా చదివించేలా చొరవ తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధారాణి కోరారు. మండలంలోని ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



విశేషాలంకారంలో సత్యనారాయణస్వామి



గరుడ వాహనంపై రంగనాథుడు



వేదగిరిలో లక్ష తులసీ పూజ

నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. వ్రతానికి 54 మంది దంపతులు హాజరయ్యారు. అన్నప్రసాద వితరణ చేశారు. అన్నవరం నుంచి తీసుకొచ్చిన స్వామివారి ప్రతిమలు, రవ్వ పొంగలి, తదితరాలను భక్తులకు అందజేశారు.

• నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గరుడసేవను వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. లక్ష తులసీ పూజ, కుంకుమార్చన, హోమాలను విశేషంగా జరిపారు. ఈఓ గిరికృష్ణ, చైర్మన్ సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరం



నెల్లూరు(క్రైమ్): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఆర్టీసీ డిస్పెన్సరీలో అధికారులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా ప్రజా రవాణాధికారి శేషయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ స్పందన

కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన బడ్జెట్‌పై వివిధ వర్గాల వారు మిశ్రమ స్పందన వ్యక్తం చేశారు. పలు రంగాలకు మరింత నిధులు కేటాయించి ఉండే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్

పరిశ్రమలకు ప్రోత్సాహం లేదు



పరిశ్రమల ప్రోత్సాహానికి చర్యలు చేపట్టలేదు. నిరాశాజనకంగా ఉంది. మౌలిక వసతుల అభివృద్ధికి బడ్జెట్‌ను కేటాయించలేదు. ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి ఎలాంటి గ్రాంట్‌ను ఇవ్వలేదు.

- ఏపీకే రెడ్డి, ఎఫ్ఎస్సెమ్ఈ నేషనల్ ప్రెసిడెంట్

ఉద్యోగులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ఉద్యోగులకు ఊరటగా ఉంది. బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాల్సి ఉంది.

- పెంచల్‌రెడ్డి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు

మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉంది



విద్యారంగానికి 0.7 శాతం కేటాయించడం దారుణం. కనీసం రెండు శాతాన్నైనా కేటాయిస్తే బాగుండేది. రాష్ట్రంలో విద్యా రంగానికి ఐదు శాతానికిపైగా నిధులను కేటాయించి అనేక విద్యా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఈ తరహాలో కేంద్ర ప్రభుత్వం సైతం నిధులను కేటాయించి మరిన్ని విద్యా సంక్షేమ పథకాలను అమలు చేయాల్సి ఉంది.

- ఫరూఖ్ అలీ, జేవీవీ రజతోత్సవ జిల్లా అధ్యక్షుడు

ఎప్పటిలాగే నిరాశ



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో ఉద్యోగులకు ఎప్పటిలాగే నిరాశ మిగిలింది. ఉద్యోగులకు ఏదో వరాలు ఇచ్చారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. పొదుపు మొత్తాన్ని రూ.ఐదు లక్షలకు పెంచడం అవసరం.

- మోహన్‌దాస్, రాష్ట్ర కౌన్సిలర్, ఏపీటీఎఫ్

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నెల్లూరు రూరల్: రూరల్ మండలంలోని గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని నెల్లూరు రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్లో రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని కోరారు. ఈ – క్రాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పలు అంశాలపై తీర్మానాలు చేశారు. రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, వైస్ ఎంపీపీలు రవీంద్రరెడ్డి, దేవసేన, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లాబక్షు, ఈఓపీఆర్డీ జలజాక్షి, ఎంఈఓ తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి



నెల్లూరు(బృందావనం): కళాకారుల సంక్షేమాన్ని కాంక్షించి వారిని ప్రోత్సహించేందుకు గానూ తమ వంతుగా కార్యక్రమాలను చేపడుతున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. సుబేదారుపేటలో నృత్య పోటీలను ఏవీకే ఫౌండేషన్, కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యగురువు మీనాక్షిని సత్కరించారు. నృత్య పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. హరినారాయణరెడ్డి, కాలేషా, అడ్వొకేట్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న శ్రీనివాసులునాయక్

నెల్లూరు రూరల్: సీనియర్ సిటిజన్లపై కుటుంబసభ్యులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. కల్లూరుపల్లిలోని శాంతి వృద్ధాశ్రమంలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలపై సీనియర్ సిటిజన్లు అవగాహన కలిగి ఉండాలని కోరారు. న్యాయసాయాన్ని ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో వసతులను ఆరాతీశారు.

సంకల్ప దీక్ష విజయవంతానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు (టౌన్): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న సంకల్పదీక్షను విజయవంతం చేయాలని సంస్థ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జేమ్స్ గార్డెన్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు బాబురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, శేషు, సహాధ్యక్షుడు అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

నెల్లూరు (టౌన్): జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి సంబంధించిన పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 8 వరకు పొడిగించారని ఆపస్మా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని నేతాజీ పైలట్ స్కూల్లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. నవోదయ విద్యాలయాల్లో ప్రవేశ పరీక్షకు కొత్త నిబంధనల కారణంగా అనేక మంది అర్హత కోల్పోయారని చెప్పారు. నవోదయ విద్యాలయ సమితి మేనేజ్‌మెంట్ నిర్వాహకులు వయస్సు అర్హతను సమీక్షించాలని కోరారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ చెంచయ్య, సుశీల పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



డీఆర్వోకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (పొగతోట): రెవెన్యూ శాఖకు సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని వీఆర్వోల జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సర్వే పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ప్రొబేషన్‌ను డిక్లేర్ చేయాలని కోరారు. అసోసియేషన్ నేతలు ప్రసాద్‌నాయుడు, జనార్దన్, పెంచలరావు పాల్గొన్నారు.

12న మెగా రక్తదాన శిబిరం

కోవూరు : మండలంలోని ఇనమడుగు గ్రామంలో ఈనెల 12వ తేదీన రెడ్‌క్రాస్, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇనమడుగులో బుధవారం వారు మాట్లాడారు.

కాంగ్రెస్ నేతల పాదయాత్ర



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపును పురస్కరించుకొని నగరంలో పాదయాత్రను పార్టీ నేతలు బుధవారం నిర్వహించారు. నగరంలోని జెండావీధి, మూలాపేట, కోటమిట్ట ప్రాంతాల్లో పాదయాత్ర సాగింది. పీసీసీ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, నేతలు వెంకట్రావ్, శ్రీనివాసులురెడ్డి, అల్లావుద్దీన్, పవన్‌కుమార్, గణేష్‌బాబు, రిజ్వానా, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: వార్డు సచివాలయ కార్యదర్శులు ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరంలోని 46వ డివిజన్లో గల కాపువీధి సచివాలయంలో ఆకస్మిక తనిఖీలను బుధవారం చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఓటుకు ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని చెప్పారు. అర్హులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయించాలని పేర్కొన్నారు. తమ పరిధిలోని ప్రజల ఆరోగ్య సమస్యలు, వారికి అందిస్తున్న చికిత్సకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో కాపువీధి సచివాలయ ప్లానింగ్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ అడ్మిన్, వీఆర్వోకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని చెప్పారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉత్తమ ప్రతిభ చూపి గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా అవార్డులను అందుకున్న అధికారులను డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బుధవారం అభినందించారు. నగరంలోని డీసీసీబీలో గల చైర్మన్ చాంబర్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సీఈఓ శంకర్‌బాబు, డీసీఓ తిరుపాల్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం రవిసింగ్‌ను సత్కరించారు. అదే విధంగా డీసీసీబీ చైర్మన్‌ను వారు సన్మానించారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నేతలు కుమార్‌పాల్, రమేష్, వరలక్ష్మి, సాజిదా, నళిని, రేచల్, క్రాంతి, ప్రజ్ఞ, ఉదయలక్ష్మి, సాధన, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన వసతులతో షాదీమంజిల్



నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అధునాతన వసతులతో షాదీమంజిల్‌ను నిర్మించామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. 43వ డివిజన్లోని కోటమిట్టలో నూతనంగా నిర్మించిన షాదీమంజిల్‌ను బుధవారం పరిశీలించారు. రెండంతస్తుల్లోని రెండు వివాహ వేదికలు, భోజనశాల, వంటశాల, వధూవరుల ప్రత్యేక గదులు, సరుకుల నిల్వ గది, లిఫ్ట్ సౌకర్యం, తదితరాలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. షాదీమంజిల్లోని అన్ని అంతస్తుల్లో అగ్ని ప్రమాద నిరోధకాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల ఐదున మొదటి శుభకార్యం జరగనుందని తెలిపారు. ఎస్ఈ సంపత్‌కుమార్, డీఈలు చంద్రయ్య, అనిల్, ఈఈ నాగేంద్ర, ఏఈ మాధవి, పబ్లిక్ హెల్త్ ఈఈ అలీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసులకు జియో ట్యాగింగ్



మాట్లాడుతున్న బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ సర్వీసులను జియో ట్యాగింగ్ చేయాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) బాబు ఆదేశించారు. నగరంలోని నెల్లూరు టౌన్ – 1 విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేసిన అనంతరం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జియో ట్యాగింగ్ ద్వారా సర్వీసులు ఏ ప్రాంతంలో ఉన్నాయో స్పష్టంగా తెలుసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. ఐఆర్డీఏ బిల్లింగ్‌ను కచ్చితంగా తీసి వినియోగదారులకు ఇవ్వాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన ఇవ్వాలని చెప్పారు. నెల్లూరు టౌన్ డివిజన్ బిల్లుల వసూళ్లలో ముందుంజలో ఉన్న నేపథ్యంలో అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నెల్లూరు(క్రైమ్): ఎస్పీ విజయారావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు పోలీస్ కార్యాలయంపై దాడి చేస్తామన్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌పై అట్రాసిటీ కేసును నమోదు చేయాలని ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమీ హుస్సేనీ కోరారు. ఈ మేరకు చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబుకు వినతిపత్రాన్ని బుధవారం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్పీ విజయారావు సమర్థమైన అధికారి అని.. జిల్లాలో ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. పోలీస్ కార్యాలయంపై దాడులు చేసేది ఉగ్రవాదులని, ఆయనకు ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నాయో పోలీస్ అధికారులు వెలికితీయాలని కోరారు.

డీపీఓలో ఎస్పీ పరిశీలన

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీస్ కార్యాలయంలోని కంప్యూటర్ ల్యాబ్, వివిధ విభాగాలను ఎస్పీ విజయారావు బుధవారం పరిశీలించారు. మినిస్టీరియల్ స్టాఫ్, డీసీఆర్బీకి కంప్యూటర్స్‌పై శిక్షణ తరగతుల నిర్వహణ, తదితరాలపై పోలీస్ అధికారులతో చర్చించారు. ఏఎస్పీ హిమవతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై ముగిసిన శిక్షణ

నెల్లూరు (టౌన్): ఇంటర్న్‌షిప్, ఎల్ఎమ్మెస్‌పై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌పై రామ్‌ప్రసాద్, త్రినాథ్ అవగాహన కల్పించారు. అధ్యాపకులు రజని, నాగమనీషా, మణి, నరేంద్ర, ప్రిన్సిపల్ గిరి, ఎన్నార్సీ కోఆర్డినేటర్ రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, తదితరులు పాల్గొన్నారు.